E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు   జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387


PUBLISHED: JANGAON,HYDERABAD   సంపుటి :01   సంచిక :214   మంగళవారం 14 జూలై 2026   ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్   పేజీలు: 04   వెల :05/-

## అయోధ్య విరాళాల కేసులో కీలక మలుపు




- కేంద్రం, యూపీకి సుప్రీం నోటీసులు
- ట్రస్ట్‌కు సమాధానం ఇవ్వాలన్న ఆదేశం
- సిట్ స్టేటస్ రిపోర్టు సమర్పించాలి
- నిధుల దుర్వినియోగంపై విచారణ
- జూలై 20కి తదుపరి విచారణ

## తెలంగాణకు సుప్రీంలో ఎదురుదెబ్బ




- పిటిషన్‌లో సాంకేతిక లోపాలు
- స్టే ఇవ్వడానికి కోర్టు నిరాకరణ
- ఏపీకి నోటీసులపై స్పష్టత
- లోపాలు సరిచేయాలని ఆదేశం
- తదుపరి విచారణ వాయిదా

**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పోలవరం ప్రాజెక్టు, కృష్ణా నీటి వినియోగం, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ అంశాలపై తెలంగాణ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. అయితే ఈ విచారణలో తెలంగాణ ప్రభుత్వానికి న్యాయస్థానంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ..


## తమిళనాడు ప్రభుత్వానికి ఊరట

- హైకోర్టు ఉత్తర్వులకు సుప్రీం స్టే
- గోవధ కేసులో కీలక మలుపు
- ప్రతివాదులకు నోటీసులు జారీ
- చట్ట నిబంధనలపై ప్రభుత్వ వాదన
- తదుపరి ఉత్తర్వుల వరకు స్టే కొనసాగింపు

2 లో

## ఆరు హత్యల కేసులో కీలక పరిణామం

- నిందితుడు రాజ్‌కుమార్ మృతి
- పాయిజన్ తాగి ఆత్మహత్య?
- పంజర్ల శివారులో మృతదేహం
- 12 బృందాల గాలింపుకు ముగింపు
- రూ.2 లక్షల రివార్డు ప్రకటన




## మమతకు కోర్టు షాక్

- రితబ్రత వర్గానికి ఊరట
- అసలైన టీఎంసీగా గుర్తింపు
- కార్యాలయాలు, నిధులపై హక్కు
- ఈసీకి తీర్పు కాపీ
- టీఎంసీలో కొత్త మలుపు




**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** పశ్చిమ బెంగాల్‌లో మాజీ సీఎం మమతా బెనర్జీకి షాక్ తగులగా, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) చీలికవర్గానికి న్యాయస్థానంలో గొప్ప ఊరట లభించింది. రెబల్ నేత రితబ్రత వర్గాన్నే తృణమూల్ కాంగ్రెస్ ఏకైక చట్టబద్ధమైన విభాగంగా గుర్తిస్తూ అలీపూర్ కోర్టు తీర్పు చెప్పింది. జూన్ 22న జాతీయ కార్యవర్గ సమావేశంలో ఏర్పాటు చేసిన కమిటీయే పార్టీకి సంబంధించిన ఏకైక చట్టబద్ధమైన విభాగమని తీర్పు చెబుతూ.. ఆ వర్గానికే పార్టీ కార్యాలయాలు, నిధులపై నియంత్రణ కల్పిస్తున్నట్టు పేర్కొంది.

తమదే అసలైన పార్టీ విభాగంగా గుర్తిస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు పట్ల రితబ్రత ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## పోలవరం పూర్తిపై సీఎం కీలక వ్యాఖ్యలు

- పుష్కరాలకల్లా పోలవరం పూర్తి
- ధవళేశ్వరం పనులకు శ్రీకారం
- 2021లోనే పూర్తయ్యేదన్న చంద్రబాబు
- సాగునీటికి రూ.24 వేల కోట్లు
- కాటన్ బ్యారేజీ పనుల ప్రారంభం

2 లో



## తెలంగాణలో 7 ఈఎస్ఐసీ ప్రాజెక్టులు

- రూ.668 కోట్ల భారీ ప్రాజెక్టులు
- సనత్‌నగర్ నుంచే ప్రారంభం
- 53 లక్షల మందికి లబ్ధి
- కొత్త ఓపీడీ సేవలు
- కార్మికులకు మెరుగైన వైద్యం
- 33 జిల్లాలకు ఈఎస్ఐ సేవలు
- మాండవీయ చేతుల మీదుగా ప్రారంభం

**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** తెలంగాణ వేదికగా దేశవ్యాప్తంగా కార్మిక సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సరికొత్త ఊతం ఇవ్వనుంది. నగరంలోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి నుంచి దేశవ్యాప్తంగా రూ.668 కోట్ల వ్యయంతో చేపట్టిన 7 కీలక ఆరోగ్య ప్రాజెక్టులను జూలై 14న కేంద్ర కార్మిక-ఉపాధి, యువజన వ్యవహారాలు-క్రీడా శాఖల మంత్రి డా.మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 53 లక్షల మంది ఈఎస్ఐ లబ్ధిదారులకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి తెలంగాణలోని హైదరాబాద్ సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి ప్రధాన కేంద్రంగా నిలవనుంది.

మిగతాది 2 లో..

## నామినేటెడ్ పదవులపై తుది కసరత్తు

- మీనాక్షి సమక్షంలో కీలక భేటీ
- పనితీరు ఆధారంగా నియామకాలు
- ఒక్కో పదవికి 10 మంది పోటీ
- చైర్మన్ పోస్టుల కోసం లాబీయింగ్
- రెన్యువల్‌పై త్వరలో నిర్ణయం




**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** నామినేటెడ్ పదవుల విషయంలో ఎవరికి రెన్యువల్ చెయ్యాలి? ఎవరిని పక్కన పెట్టాలి? కొత్తగా ఎవరికి అవకాశం ఇవ్వాలి? అనే అంశంపై పార్టీ, ప్రభుత్వ పెద్దల్లో పెద్ద ఎత్తున చర్చోప చర్చలు జరుగుతున్నాయి. పనితీరు ఆధారంగా నియామకాలు జరపాలని భావిస్తోన్న సీఎం రేవంత్.. పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమక్షంలో తుది నిర్ణయం తీసుకునే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

## టీజీ టెట్ ఫలితాల విడుదల




- 43.94 శాతం మంది అర్హత సాధింపు
- 50,544 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులు
- జూలై 21న ప్రత్యేక టెట్ నోటిఫికేషన్

## కాంగ్రెస్‌పై పోరుకు సిద్ధం

- హరీశ్‌రావు పాదయాత్ర ప్రకటన
- బసవేశ్వర నుంచి సంగమేశ్వర వరకు
- ప్రాజెక్టుల నిలిపివేతపై ఆగ్రహం
- ప్రజల్లోకి ప్రభుత్వ వైఫల్యాలు
- రాష్ట్ర రాజకీయాల్లో హీట్




**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** తెలంగాణ రాజకీయాల్లో మరో ఉత్కంఠభరిత పరిణామానికి తెరలేచింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రాజెక్టుల నిలిపివేతను నిరసిస్తూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు సంచలన ప్రకటన చేశారు. త్వరలోనే తాను క్షేత్రస్థాయిలోకి వెళ్లనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా 'బసవేశ్వర నుండి సంగమేశ్వర' వరకు భారీ పాదయాత్ర చేపట్టబోతున్నట్లు హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ యాత్ర ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను జనాల్లోకి తీసుకెళ్లి ఎండగట్టడమే తన అజెండా అని ఆయన ప్రకటించారు.

ప్రాజెక్టుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి అవలంబిస్తున్న తీరుపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## ఇరాన్ హిట్‌లిస్టు!




- 13 మంది నేతలతో ఇరాన్ 'రివేంజ్ లిస్ట్'
- ట్రంప్, నెతన్యాహు పేర్లు జాబితాలో
- పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ ఉద్రిక్తతలు
- అమెరికా-ఇరాన్ పరస్పర దాడులు
- హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్త పరిస్థితులు
- దౌత్య చర్చలు విఫలమయ్యాయని టెహ్రాన్ ఆరోపణ

# తమిళనాడు ప్రభుత్వానికి ఊరట



**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** తమిళనాడులో గోవధపై మద్రాస్ హైకోర్టు ఇచ్చిన కీలక ఆదేశాలకు సుప్రీంకోర్టు సోమవారం తాత్కాలికంగా స్టే విధించింది. బక్రీద్ పండుగకు ముందు గానీ, ఆ తర్వాత ఏ రోజైనా గానీ రాష్ట్రంలో ఆవులు, దూడలను వధ చేయకుండా చూడాలని మద్రాస్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

రెండు వారాల క్రితం తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తమిళనాడు జంతు సంరక్షణ చట్టం – 1958లోని సెక్షన్–4 ప్రకారం అనుమతించిన ప్రత్యేక పరిస్థితుల్ని మినహాయించి.. ఆవుల వధపై సంపూర్ణ నిషేధం విధించడం చట్టానికి విరుద్ధమని ప్రభుత్వం తన పిటిషన్లో పేర్కొంది. ప్రస్తుత చట్టం ప్రకారం 10 సంవత్సరాలు దాటినా లేదా.. వ్యవసాయ పనులకు, సంతానోత్పత్తికి పనికిరాని పశువుల్ని సంబంధిత అధికారుల ధృవీకరణ పత్రంతో వధించేందుకు అనుమతి ఉందని ప్రభుత్వం వాదించింది. ఈ వాదనలను పరిశీలించిన సుప్రీంకోర్టు.. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో సవరణ చేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానిస్తూ.. ఆ ఉత్తర్వుల్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు హైకోర్టు ఆదేశాలు అమల్లో ఉండవని స్పష్టం చేసింది.

ఈ వివాదానికి కారణమైన ఉత్తర్వులను మే 27న జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ వి లక్ష్మీనారాయణన్‌లతో కూడిన మద్రాస్ హైకోర్టు ధర్మాసనం జారీ చేసింది. అధీకృత స్లాటర్ హౌస్‌లలో మాత్రమే జంతువుల వధ జరగాలని పేర్కొన్న హైకోర్టు, బక్రీద్ సందర్భంగా మాత్రమే కాకుండా ఇతర ఏ రోజునైనా ఆవులు, దూడలను వధ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇవ్వాలని కూడా పేర్కొంది.

# అయోధ్య విరాళాల కేసులో కీలక మలుపు



**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సుప్రీంకోర్టు ఈ వ్యవహారంపై విచారణ జరిపి.. కేంద్రం, యూపీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. నిధుల దుర్వినియోగంపై న్యాయస్థానం పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరపాలని దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం కీలక విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంపై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపి, రామాలయ నిర్వహణను చూసుకునే ‘శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్’కు కూడా తమ సమాధానాన్ని దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ నిధుల దుర్వినియోగంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించిన ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును కోర్టుకు సమర్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ సిట్ బృందంలో ఎవరెవరు సభ్యులుగా ఉన్నారనే వివరాలను కూడా ఆ నివేదికలో స్పష్టంగా పేర్కొనాలని ఆదేశిస్తూ.. కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి (జూలై 20, 2026) వాయిదా వేసింది.

# పోలవరం పూర్తిపై సీఎం కీలక వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** పోలవరం ప్రాజెక్టు పూర్తిపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. కోనసీమ జిల్లాలో పర్యటించిన ఆయన ధవళేశ్వరం బ్యారేజీ కొత్త గేట్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు రాబోతున్నాయని, అప్పటికి ముందే పోలవరం పూర్తి చేసి ప్రజలకు అంకితమిస్తామని చెప్పారు. రూ.153 కోట్లతో కాటన్ బ్యారేజీ గేట్ల మరమ్మత్తు పనులు చేశామని తెలిపారు. కాటన్ బ్యారేజీ నిర్మించి 175 ఏళ్లు అయిందని గుర్తు చేశారు. దేశానికి అన్నపూర్ణగా గోదావరి డెల్టా మారడానికి కాటనే కారణమన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండి ఉంటే 2021లోనే పోలవరం పూర్తయ్యేదని చెప్పారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు ఇచ్చామన్నారు. కృష్ణా నీటిని రాయలసీమకు అందించామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

నా హయాంలోనే రెండు పుష్కరాలు

“రైతులకు అన్నదాత సుఖీభవ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసిన సీఎం చంద్రబాబు.. రూ.24 వేల కోట్లు సాగునీటి కోసం ఖర్చు చేశామని తెలిపారు. “తుంగభద్ర గేట్లు కొట్టుకుపోతే మళ్లీ ఏర్పాటు చేశాం. రెండు పుష్కరాలు నా హయాంలోనే జరుగుతున్నాయి. సైబరాబాద్‌ను నేనే అభివృద్ధి చేశా.” అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# తెలంగాణకు సుప్రీంలో ఎదురుదెబ్బ

**మొదటి పేజీ తరువాయి** ఈ కేసులో మొత్తం 15 మంది ప్రతివాదులు ఉన్నారని, ఏపీ ప్రభుత్వం చేపడుతున్న పనులపై తక్షణమే స్టే (ఇంజెక్షన్ ఉత్తర్వులు) ఇవ్వడంతో పాటు నోటీసులు జారీ చేయాలని అభ్యర్థించారు.

అయితే, తెలంగాణ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలు ఉన్నాయని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం వేలెత్తి చూపింది. పిటిషన్‌లోని ఆ లోపాలను పూర్తిగా సరిదిద్దే వరకు ఎలాంటి క్షేత్రస్థాయి విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. తొలుత ఆ లోపాలను సరిదిద్దిన తర్వాతే విచారణలో మిగతా అంశాలను పరిశీలిస్తామని కోర్టు తేల్చి చెప్పింది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించకుండా, ప్రాథమిక లోపాలు ఉన్న స్థితిలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడం కానీ, ఇంజెక్షన్ ఉత్తర్వులు ఇవ్వడం కానీ అస్సలు కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# ప్రభుత్వంపై అసంతృప్తి.. ‘బోడిగుండు’తో నిరసన



**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో ఉద్యోగ సంఘాల ఫెడరేషన్ వినూత్న నిరసనకు దిగింది. ‘చంద్రన్న బోడిగుండు’ పేరుతో ఫెడరేషన్ చైర్మన్ వెంకట్రామిరెడ్డితో పాటు పలువురు నేతలు గుండు చేయించుకుని ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఉద్యోగులకు రావాల్సి ఆర్థిక ప్రయోజనాలను కూడా ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని మండిపడ్డారు. పీఆర్సీతో పాటు ఐఆర్, డీఏలు, సరెండర్ లీవ్‌ల చెల్లింపులనూ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల ప్రయోజనాలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఐఆర్ విషయంలోనూ అన్యాయమే జరిగిందన్నారు. ఉద్యోగులతో పాటు వాలంటీర్లకు కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ నెరవేర్చే వరకూ తమ పోరాటం కొనసాగుతోందని హెచ్చరించారు.

# నామినేటెడ్ పదవులపై తుది కసరత్తు

**మొదటి పేజీ తరువాయి** ఈ నెల 14న పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి హైదరాబాద్‌కు రానున్నారు. 15 లేదా 16 తేదీల్లో నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా సమావేశమై నామినేటెడ్ పదవుల నియామకం పై తుది నిర్ణయం తీసుకుంటారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఒక్కో పదవికి 10 మంది పోటీ..

ఈ నెల 8న 37 మంది నామినేటెడ్ చైర్మన్ల రెండేళ్ల పదవీకాలం ముగిసింది. ఈ పదవులను దక్కించుకునేందుకు తాజా మాజీ చైర్మన్లు, అసలే పదవులు దక్కని లీడర్లు సైతం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పదవి ఉంటే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ సౌకర్యం లభిస్తుంటుంది. మంత్రులు, అధికారుల వద్దకు ఈజీగా వెళ్లే అవకాశం ఉంటుంది. వీటికి తోడు ప్రభుత్వం కల్పించే వెహికల్, గన్‌మెన్ సౌకర్యంతో రాజకీయంగా పరపతి పెరుగుతుంది. రాజకీయాల్లో మరింత ఎత్తుకు ఎదిగేందుకు వెసులుబాటు కలుగుతుంది. అందుకని చైర్మన్ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలనే తపనలో లీడర్లు ఉన్నారు. దీంతో ఒక్కో పదవికి సుమారు 10 మంది వరకు పోటీ పడుతున్నట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

పెద్ద ఎత్తున లాబీయింగ్

చైర్మన్ పదవులను దక్కించుకోవాలని టార్గెట్‌గా పెట్టుకున్న లీడర్లు పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నారు. ముందుగా జిల్లాకు చెందిన మంత్రుల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. ఆ తరువాత జిల్లా ఇన్‌చార్జిల మనస్సు గెలుచుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఈ రెండు చోట్ల లైన్‌క్లియర్ అయిన వెంటనే ప్రభుత్వంలోని కీలక నేతల ఆశీస్సుల కోసం లాబీయింగ్ చేస్తున్నారు. కొందరు నేరుగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరైతే ఏకంగా ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నట్లు తెలిసింది. పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీలోని కీలక నేతలు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ వద్దకు వెళ్లి పదవి ఇప్పించాలని ప్రాధేయపడుతున్నట్టు తెలిసింది.

మరో ఛాన్స్ కోసం..

తాజా మాజీ చైర్మన్లు అందరూ మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇందులో కొందరికి మాత్రమే రెన్యువల్ చేసే అవకాశం ఉంది. చైర్మన్ హోదాలో సదరు నాయకుడు పనితీరు ఆధారంగా మరోసారి అవకాశం ఇవ్వాలని సీఎం భావిస్తున్నట్టు తెలిసింది. అదే సంస్థకు చైర్మన్ పదవి ఇవ్వాలా? లేక మరో సంస్థ బాధ్యతలు అప్పగించాలా? అనే అంశంపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. కొందరు పాత సంస్థలో మరోసారి పని చేసేందుకు మొగ్గుచూపుతుండగా, మరికొందరు కొత్త సంస్థలో పనిచేసేందుకు చొరవ చూపుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

# కాంగ్రెస్‌పై పోరుకు సిద్ధం

**మొదటి పేజీ తరువాయి** గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాల పనులను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నిలిపివేసిందని ఆయన ఆరోపించారు. “ప్రాజెక్టులను ఆపి ఈ ప్రాంత రైతులకు అన్యాయం చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ఆ బసవేశ్వరుడు, సంగమేశ్వరుడే తగిన గుణపాఠం చెబుతారు” అని హరీశ్ రావు హెచ్చరించారు.

ప్రజా క్షేత్రంలోనే కాంగ్రెస్ తప్పుల లెక్కింపు..

అధికారంలోకి వచ్చిన నాటి నుండి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, పైగా నడుస్తున్న ప్రాజెక్టులను కూడా పడకేసేలా చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ చేస్తున్న ఈ చారిత్రక తప్పులను, వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకే తాను జనం మధ్యకు వస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పాదయాత్ర ద్వారా నిలిచిపోయిన ప్రాజెక్టుల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ఏకైక లక్ష్యంగా హరీశ్ రావు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. హరీశ్ రావు పాదయాత్ర ప్రకటనతో ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగింది.

# తెలంగాణలో 7 ఈఎస్ఐసీ ప్రాజెక్టులు

**మొదటి పేజీ తరువాయి** ఇక్కడి రూ.211.13 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన నూతన ఓపీడీ విభాగాన్ని కేంద్ర మంత్రి స్వయంగా ప్రారంభించనుండగా, దేశంలోని మిగిలిన 6 ప్రాజెక్టులను ఇక్కడి నుంచే వర్చువల్ విధానంలో దేశానికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్మిక–ఉపాధి, సూక్ష్మ–చిన్న–మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే కూడా పాల్గొంటారు. దేశ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్న నిర్మాణ కార్మికులను ఈ వేదికపై మాండవీయ సత్కరించనున్నారు. అలాగే ఈఎస్ఐ లబ్ధిదారులకు నగదు ప్రయోజనాలను అందజేస్తారు.

తెలంగాణ కార్మికులకు వరం.. సనత్‌నగర్ కొత్త ఓపీడీ

హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల, ఆసుపత్రి ఆవరణలో 43,611.04 చదరపు మీటర్ల భారీ విస్తీర్ణంలో ఈ నూతన ఓపీడీ విభాగాన్ని అత్యాధునిక వసతులతో నిర్మించారు. ఇందులో జనరల్ మెడిసిన్, ఈఎన్టీ, డెంటల్, గైనకాలజీ, కంటి చికిత్స, ఆర్థోపెడిక్స్, సైకియాట్రీ, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, ఆయుష్ విభాగాల ఓపీడీ సేవలు ఒకే చోట లభిస్తాయి. దీనితో పాటు ఫిజియోథెరపీ, రేడియాలజీ, యోగా కేంద్రం, 180 సాధారణ పడకలు (మూడు 60 పడకల వార్డులు), 25 ఐసీయూ పడకలు, 20 ఎన్ఐసీయూ పడకలు, మందుల దుకాణం, క్లినికల్ లెక్చర్ థియేటర్లను ఏర్పాటు చేశారు.

ఈ కొత్త విభాగం ద్వారా తెలంగాణలోని హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని 12,30,183 మంది బీమా చందాదారులు, వారి కుటుంబ సభ్యులకు సమగ్ర వైద్య సేవలు అందనున్నాయి. కాగా... 1975 మార్చి 30న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేవలం జంట నగరాల (హైదరాబాద్, సికింద్రాబాద్) పరిధికే పరిమితమై ప్రారంభమైన ఈ ఈఎస్ఐ ఆస్పత్రి, కాలక్రమేణా సేవలని విస్తరించింది. ప్రస్తుతం ఈఎస్ఐసీ 2.0 సంస్కరణల కింద తెలంగాణలోని మొత్తం 33 జిల్లాలకూ ఈ పథకాన్ని వర్తింపజేశారు. దీని ద్వారా రాష్ట్రంలో సామాజిక భద్రత కింద మొత్తం 19,15,700 మంది బీమా చందాదారులు, 74,32,916 మంది లబ్ధిదారులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి.

దేశవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఇతర ప్రాజెక్టుల వివరాలు

రాజమహేంద్రవరం ఈఎస్ఐఎస్ ఆసుపత్రి (ఆంధ్రప్రదేశ్): ఇక్కడ 26 ఓపీడీ గదులు, 3 ఆధునిక మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో కూడిన వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. దీనివల్ల 1,31,190 మంది బీమా చందాదారులతో పాటు మొత్తం 2,52,717 మంది లబ్ధిదారులకు మేలు జరుగుతుంది.

బెల్తోలా ఈఎస్ఐసీ ఆసుపత్రి (అస్సాం): ఇక్కడి ఆసుపత్రిని 200 పడకల సామర్థ్యానికి ఉన్నతీకరించారు. దీని ద్వారా అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్‌లలోని 3.42 లక్షల మంది బీమా చందాదారులతో సహా మొత్తం 13.27 లక్షల మందికి లబ్ధి చేకూరుతుంది.

శ్రీపెరంబుదూర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి (తమిళనాడు): ప్రముఖ మ్యానుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మారిన శ్రీపెరంబుదూర్‌లో 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించనున్నారు. ఇక్కడ ఓపీడీ, ఎమర్జెన్సీ, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, ల్యాబ్, ఫార్మసీ సదుపాయాలు ఉంటాయి. దీనివల్ల కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాల పరిధిలోని 5.5 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుంది.

సురేంద్రనగర్ ఈఎస్ఐ డిస్పెన్సరీ (గుజరాత్): ఇక్కడ ఒకే చోట ప్రాథమిక ఆరోగ్య సేవలు, వైద్య సంప్రదింపులు, మందులు లభిస్తాయి. దీని ద్వారా సుమారు 35,000 మందికి లబ్ధి చేకూరుతుంది.

కోటా ఉద్యోగ నగర్ ఈఎస్ఐ డిస్పెన్సరీ (రాజస్థాన్): ఇక్కడి పారిశ్రామిక ప్రాంత కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా 75,000 మంది బీమా చందాదారులు సహా మొత్తం 2,91,000 మందికి సేవలు అందుతాయి.

భవానీ మండి ఈఎస్ఐ డిస్పెన్సరీ (రాజస్థాన్): ప్రముఖ టెక్స్‌టైల్ హబ్ అయిన ఈ ప్రాంతంలోని పారిశ్రామిక కార్మికుల కోసం ఏర్పాటైన ఈ డిస్పెన్సరీ ద్వారా 27,715 మంది చందాదారులు సహా మొత్తం 1.07 లక్షల మందికి ఆరోగ్య సేవలు అందనున్నాయి.

# ఆరు హత్యల కేసులో కీలక పరిణామం




**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని దైవాలగూడ గ్రామంలో ఒకే రాత్రి ఆరుగురిని కిరాతకంగా నరికి చంపి, రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కథ విషాదాంతమైంది. గత రెండు రోజులుగా పోలీసుల కళ్లుగప్పి పరారీలో ఉన్న రాజ్‌కుమార్ చివరకు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు మండల పరిధిలోని పంజర్ల గ్రామ శివారులో అతడి మృతదేహం లభ్యమవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

ఘటనా స్థలంలో పాయిజన్ బాటిల్..

పోలీసుల కథనం ప్రకారం.. పంజర్ల గ్రామ శివారు ప్రాంతంలో ఒక వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడిని షాబాద్ నరమేధం కేసులో మోస్ట్ వాంటెడ్ నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్‌గా గుర్తించారు. మృతదేహం పక్కనే పాయిజన్ బాటిల్ లభ్యం కావడంతో, పోలీసుల వేట తీవ్రమవ్వడం, ఎటూ తప్పుకుపోయే అవకాశం లేకపోవడంతో అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

మేనమామ ఊరిలో బలవన్మరణం

అయితే, హత్యలు జరిగిన తర్వాత నిందితుడిని పట్టుకునేందుకు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు సుమారు 12 ప్రత్యేక బృందాలతో విస్తృతంగా గాలింపు చేపట్టారు. అంతేకాకుండా అతడి ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షల నగదు బహుమతిని కూడా ప్రకటించారు. పోలీసుల గాలింపు తీవ్రమవడంతో ఎక్కడా ఆశ్రయం దొరకక, చివరకు కొత్తూరు మండలంలోని తన మేనమామ ఊరైన పంజర్లకు రాజ్‌కుమార్ చేరుకున్నాడు. అక్కడే గ్రామ శివారులోకి వెళ్లి విషం తాగి ప్రాణాలు తీసుకున్నాడు. తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో కన్నబిడ్డలు, భార్యతో సహా ఆరుగురిని పొట్టనబెట్టుకున్న కిరాతకుడు.. చివరకు ఇలా పాయిజన్ తాగి శవమై తేలడంతో కేసు దాదాపు ముగిసినట్లయింది. ఈ మేరకు పోలీసులు రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# టీజీ టెట్ ఫలితాల విడుదల

**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీటెట్–జూన్ 2026) ఫలితాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ విడుదల చేశారు. జూన్ 16 నుంచి 22 వరకు కంప్యూటర్ ఆధారిత విధానంలో 10 సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,53,752 మంది దరఖాస్తు చేసుకోగా, 1,15,028 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 50,544 మంది అర్హత సాధించగా, మొత్తం ఉత్తీర్ణత శాతం 43.94గా నమోదైంది.

పేపర్–1లో ఉత్తీర్ణత శాతం 65.29గా ఉండగా, పేపర్–2 (మ్యాథ్స్ అండ్ సైన్స్)లో 40.76 శాతం, పేపర్–2 (సోషల్ స్టడీస్)లో 25.79 శాతం అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టీజీటెట్ నోటిఫికేషన్‌ను జూలై 21న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఆ పరీక్షలు సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు సీబీటీ విధానంలో నిర్వహించబడతాయి. ఇకపై ప్రతి సంవత్సరం మొత్తం నాలుగు టెట్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో రెండు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు, మరో రెండు సాధారణ అభ్యర్థులకు కేటాయించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఇరాన్ హిట్‌లిస్టు!



**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** పశ్చిమాసియా లో యుద్ధం ఆగినట్టే కనిపించినా ఇటీవల మళ్లీ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్, అమెరికా పరస్పర దాడులతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న నౌకలపై ఐఆర్‌జీసీ దాడులు చేయడం తాజా ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని స్థానిక మీడియా.. 13 మంది విదేశీ నేతల పేర్లతో ఉన్న రివేంజ్ లిస్ట్‌ను ప్రచురించింది. ఈ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ సహా పలువురు ఐరోపా నేతల పేర్లు ఉన్నాయి.

ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో నాటి సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని ఇటీవల మొజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. బాధ్యులైన వారు పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇది తమ దేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్ అని, దానిని కచ్చితంగా నెరవేరుస్తానని అన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రతీకార జాబితా బయటకు రావడం చర్చనీయాంశమైంది.

ఇరాన్ వ్యాప్తంగా పదుల సంఖ్యలో లక్ష్యాలపై తాము దాడి చేశామని, వాటిలో క్షిపణి, డ్రోన్ ప్రయోగ కేంద్రాలు, మందుగుండు సామగ్రి డంప్‌లు, కమ్యూనికేషన్ సాధనాలు, చిన్న బోట్ల వంటివి ఉన్నాయని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అనంతరం గల్ఫ్‌లోని పలు దేశాల్లో సైరన్లు వినిపించాయి. బహ్రెయిన్, కువైట్, ఖతార్, జోర్డాన్, ఒమన్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తాజాగా ఇరాన్ ప్రకటించింది. బహ్రెయిన్‌లోని అమెరికా డ్రోన్ ఫ్లీట్, రెండు క్షిపణి లాంచర్లు, క్షిపణులను నిల్వ చేసిన గిడ్డంగులను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది.

అగ్రరాజ్యం చేస్తున్న దాడులతో పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ఇంతకాలంగా జరిగిన దౌత్యచర్చలు నిరుపయోగంగా మారాయని టెహ్రాన్ దుయ్యబట్టింది. అమెరికా వల్లే హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ నౌకాయానానికి అంతరాయం ఏర్పడిందని ఆరోపించింది.

# మమతకు కోర్టు షాక్



**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** పశ్చిమ బెంగాల్‌లో మాజీ సీఎం మమతా బెనర్జీకి షాక్ తగులగా, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) చీలికవర్గానికి న్యాయస్థానంలో గొప్ప ఊరట లభించింది. రెబల్ నేత రితబ్రత వర్గాన్నే తృణమూల్ కాంగ్రెస్ ఏకైక చట్టబద్ధమైన విభాగంగా గుర్తిస్తూ అలీపూర్ కోర్టు తీర్పు చెప్పింది. జూన్ 22న జాతీయ కార్యవర్గ సమావేశంలో ఏర్పాటు చేసిన కమిటీయే పార్టీకి సంబంధించిన ఏకైక చట్టబద్ధమైన విభాగమని తీర్పు చెబుతూ.. ఆ వర్గానికే పార్టీ కార్యాలయాలు, నిధులపై నియంత్రణ కల్పిస్తున్నట్టు పేర్కొంది.

తమదే అసలైన పార్టీ విభాగంగా గుర్తిస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు పట్ల రితబ్రత ఆనందాన్ని వ్యక్తం చేశారు. న్యాయస్థానం ఉత్తర్వు కాపీ వచ్చిన వెంటనే దానిని ఎన్నికల సంఘానికి పంపుతానని తెలిపారు. ఈ తీర్పు తర్వాత గుర్తింపు పొందిన కమిటీకి తప్ప మరెవరికీ తృణమూల్ కాంగ్రెస్ పేరుతో సంస్థను నడిపే హక్కు లేదని ఆయన ఉద్ఘాటించారు. ఈ తీర్పుతో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు, నిధులపై తమకు పూర్తి నియంత్రణ వస్తుందన్నారు.

# 80 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడి

## జనగామ జిల్లా లింగంపల్లిలో అమానుష ఘటన

## నిందితుడి అరెస్ట్-బాధితురాలికి న్యాయం చేయాలని గ్రామస్తులు, మహిళా సంఘాల డిమాండ్

తెలుగు గళం న్యూస్ జనగామ /చిల్పూర్ జూలై 13:





జనగామ జిల్లా చిల్పూర్ మండలం లింగంపల్లి గ్రామంలో 80 ఏళ్ల వృద్ధురాలిపై జరిగిన లైంగిక దాడి ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది.గ్రామానికి చెందిన పురుమాని రాజమ్మ అనే వృద్ధురాలు ఆదివారం రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో, అదే గ్రామానికి చెందిన పురుమాని రాజేష్ యాదవ్ అనే యువకుడు ఇంట్లోకి చొరబడి ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు,గ్రామస్తులు ఆరోపించారు.ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి.బాధితురాలు అరుపులు వినిపించడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు అక్కడికి చేరుకుని ఆమెను వెంటనే 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారని, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.బాధితురాలి కుటుంబ కుటుంబ సభ్యులు సభ్యుల ఫిర్యాదు





అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి నిందితుడు రాజేష్ యాదవ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం అతడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, వైద్య నివేదికలు మరియు ఇతర ఆధారాలను సేకరిస్తున్నట్లు వెల్లడించారు.ఈ అమానుష ఘటనపై గ్రామస్తులు, మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. మహిళల భద్రతకు భంగం కలిగించే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.బాధితురాలికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలని, వేగవంతమైన విచారణ చేపట్టి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.ఈ ఘటనతో లింగంపల్లి గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, పోలీసులు గ్రామంలో భద్రతను పెంచి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# తమ్ముడపల్లి (జి) పాఠశాలలో 350 నోటు పుస్తకాల పంపిణీ

## విద్యార్థులకు విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ కూరపాటి నాగేశ్వరరావు

తెలుగు గళం న్యూస్ జఫర్ఘడ్ జూలై 13



జనగామ జిల్లా జఫర్ఘడ్ మండలం తమ్ముడపల్లి (జి) గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పదవీ విరమణ పొందిన ప్రిన్సిపాల్ కూరపాటి నాగేశ్వరరావు సోమవారం 350 నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.తమ్ముడపల్లి (జి) జెడ్పీ పాఠశాలలో ఐదో తరగతి వరకు విద్యాభ్యాసం చేసిన నాగేశ్వరరావు అనంతరం ఉన్నత విద్యను అభ్యసించి రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా సేవలందించి పదవీ విరమణ పొందారు.స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడేలా నోటు పుస్తకాలను అందజేసి తన సామాజిక బాధ్యతను చాటుకున్నారు.ఈ సందర్భంగా



ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్య ద్వారానే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని, క్రమశిక్షణ, కష్టపడి చదివే అలవాటు మరియు మంచి నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ప్రోత్సహించారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేసిన కూరపాటి నాగేశ్వరరావుకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మారేపల్లి ప్రభాకర్, కూరపాటి రాజయ్య, బిక్షపతి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


# శంకరాజుపల్లిలో పారిశుధ్యానికి పెద్దపీట

## 9వ వార్డులో డ్రైనేజీ కాల్వల శుభ్రత పనులు ప్రారంభం

## జేసీబీతో పూడిక, చెత్త తొలగింపు - - వర్షాకాల సమస్యల నివారణకు ప్రత్యేక చర్యలు

తెలుగు గళం న్యూస్ శంకరాజుపల్లి, జూలై 13

శంకరాజుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇస్తూ 9వ వార్డులో డ్రైనేజీ కాల్వల శుభ్రత పనులను గ్రామ సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్ ప్రారంభించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాల్వల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి, పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలను జేసీబీ యంత్రాల సహాయంతో తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. పనులను సర్పంచ్ స్వయంగా పర్యవేక్షిస్తూ అధికారులకు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.డ్రైనేజీ కాల్వలు పూడిపోవడం వల్ల వర్షపు నీరు నిల్వ ఉండటం, దుర్వాసన వ్యాపించడం, దోమల పెరుగుదలతో ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని సర్పంచ్ తెలిపారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా పారిశుధ్య కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా సర్పంచ్ దేవులపల్లి విజయ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం గ్రామపంచాయతీ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.ప్రతి వార్డులో డ్రైనేజీ కాల్వలను శుభ్రపరచడంతో పాటు చెత్త తొలగింపు, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్తులు కూడా చెత్తను డ్రైనేజీ కాల్వల్లో వేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.9వ వార్డులోని ప్రధాన డ్రైనేజీ మార్గాలను పూర్తిగా శుభ్రపరచి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు



తీసుకుంటున్నామని, అవసరమైతే ఇతర వార్డుల్లో కూడా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి డ్రైనేజీ కాల్వల మరమ్మతులు, శుభ్రత పనులను దశలవారీగా చేపడతామని తెలిపారు.సర్పంచ్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు స్వాగతించారు. చాలా కాలంగా పేరుకుపోయిన చెత్త తొలగిపోవడంతో పరిసరాలు పరిశుభ్రంగా మారతాయని, దోమల బెడద తగ్గి ప్రజారోగ్యానికి మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ హామీతో సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు ముగింపు"

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీతో విరమించిన సిఎండిఓఎఐ ఉద్యమం"



సత్తుపల్లి,ఆర్ సి,జూలై13(తెలుగుగళం) న్యూస్: సింగరేణి కాలరీస్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సిఎండిఓఎఐ) సత్తుపల్లి శాఖ ఆధ్వర్యంలో అధికారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత కొన్ని రోజులుగా కొనసాగిన రిలే నిరాహార దీక్షలు సోమవారం విజయవంతంగా ముగిశాయి. అధికారుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి హామీ ఇవ్వడంతో దీక్షలను విరమించినట్లు సిఎండిఓఎఐ నాయకులు తెలిపారు.

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపి, డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో పాటు సింగరేణి సంస్థ అభివృద్ధిలో అధికారుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారని తెలిపారు. ప్రభుత్వ చొరవతో నిరసన కార్యక్రమం విజయవంతంగా ముగియడం పట్ల సిఎండిఓఎఐ సత్తుపల్లి కమిటీ ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపింది.

ఈ ఉద్యమానికి అండగా నిలిచిన అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ), ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ), భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్), హింద్ మజ్దూర్ సభ (హెచ్‌ఎంఎస్), సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ), ఎస్సీ--ఎస్టీ అసోసియేషన్, బీసీ--ఓబీసీ సంక్షేమ సంఘం, డ్రైవర్ల సంఘం, లేడీస్ క్లబ్ సభ్యులు, సేవా సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అలాగే అధికారుల డిమాండ్లను ప్రజల దృష్టికి, ప్రభుత్వ దృష్టికి చేర్చడంలో కీలక పాత్ర పోషించిన ముద్రిత, దృశ్య మాధ్యమాల ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా సింగరేణి సంస్థ అభివృద్ధికి, అధికారుల సంక్షేమానికి అందరి సహకారం కొనసాగాలని సిఎండిఓఎఐ సత్తుపల్లి శాఖ ఆకాంక్షించింది.

# నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి జూలై 15న ఇందిరాపార్క్ ధర్నా విజయవంతం చేయాలి

## సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి

తెలుగు గళం న్యూస్ జనగామ, జూలై 13

చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం జనగామలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ధర్నా కరపత్రాన్ని విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, అయితే 12 సంవత్సరాలు గడిచినా ఆ హామీని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడం ఆందోళనకరమని, ఉద్యోగాలు కల్పించాల్సిన ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తోందని ఆరోపించారు. ఉద్యోగాలు లభించే వరకు యువతకు నిరుద్యోగ భృతి అందించాలని, అన్ని బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రెండు లక్షల ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీల అమలులో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగ యువత ఎదురుచూస్తోందని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.జూలై 15న జరిగే



ఇందిరాపార్క్ ధర్నాలో జనగామ జిల్లా యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, ముఖ్య చందు నాయక్, సాత్విక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు టీజీఎస్పీడీసీఎల్ నాయకుల వినతి

## ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీఎండీలతో రివ్యూ మీటింగ్



తెలుగు గళం న్యూస్ హైదరాబాద్

జాతీయ ఎస్టీ కమిషన్ గౌరవ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను సోమవారం హైదరాబాద్‌లోని దిల్‌కుషా గెస్ట్ హౌస్ (లోక్ భవన్)లో టీజీఎస్పీడీసీఎల్ ఎస్టీ అసోసియేషన్ ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సంస్థలో పనిచేస్తున్న ఎస్టీ ఉద్యోగులు,అధికారుల సమస్యలు, వారి గ్రీవెన్సెస్ (ఫిర్యాదులు)లకు సంబంధించిన సమగ్ర వినతిపత్రాన్ని (రిప్రజెంటేషన్) ఆయనకు అందజేశారు.ఈ వినతిపై జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ సానుకూలంగా స్పందించారు. ఎస్టీ ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుగా.. అతిత్వరలోనే రాష్ట్ర ఇంధన శాఖ (ఎనర్జీ) ప్రిన్సిపల్ సెక్రటరీ,టీజీట్రాన్స్‌కో సీఎండీ,నాలుగు విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కాంలు) సీఎండీలతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని (రివ్యూ మీటింగ్) ఏర్పాటు చేయనున్నట్లు ఆయన నాయకులకు హామీ ఇచ్చారు.ఎస్టీ ఉద్యోగుల హక్కుల రక్షణకు కమిషన్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.కమిషన్ సభ్యుడిని కలిసిన వారిలో ఎస్టీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంజీ, ఏఈ పెంట్యా నాయక్,టీజీఎస్పీడీసీఎల్ అసోసియేషన్ ముఖ్య నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు మైసా శంకరయ్యకు ఘన సన్మానం

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి



తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారునిగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో కళాజాతల ద్వారా ప్రజల్లోకి విజయవంతంగా తీసుకెళ్లిన మైసా శంకరయ్య (ఎర్రన్న) బదిలీ అయ్యారు.ఈ మేరకు రాష్ట్ర సాంస్కృతిక శాఖ సభ్య కార్యదర్శి ఏనుగు నరసింహ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఆయన ప్రస్తుత విధుల నుండి విడుదలవుతున్న సందర్భంగా సోమవారం జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) కార్యాలయంలో శంకరయ్యకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డిపిఆర్ఓ శీలం శ్రీనివాస్ మాట్లాడుతూ.. శంకరయ్య టీమ్ లీడర్‌గా తన విధుల్లో అందరినీ సమన్వయం చేసుకుంటూ ఎంతో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కళాజాత కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించడంలో ఆయన చేసిన సేవలు ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. శంకరయ్య సేవలను గుర్తిస్తూ ఆయనను శాలువాతో సత్కరించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ కార్యాలయ సిబ్బంది రంజిత్, శ్రీనివాస్, కుమార్, ప్రవీణ్, రవి, రజిత, శ్యామల, శిరీష, స్వప్న, స్వాతి, నాగమణి తదితరులు పాల్గొని శంకరయ్యకు ఘనంగా వీడ్కోలు పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు.

# హర్మ్యూజ్‌ను రక్షిస్తాం.. రుసుము చెల్లించండి: ట్రంప్



వాషింగ్టన్, తెలుగు గళం:: హర్మ్యూజ్‌ను మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హర్మ్యూజ్ జలసంధిని ఇకపై అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందని వెల్లడించారు. నిర్వహణ బాధ్యతను కూడా అగ్రరాజ్యమే చేపడుతుందన్నారు. అందుకుగానూ, హర్మ్యూజ్ గుండా ప్రయాణించే ప్రతి వాణిజ్య నౌక 20 శాతం ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు.

" ఇకపై అమెరికా.. హర్మ్యూజ్ జల సంధి సంరక్షకుడిగా వ్యవహరిస్తుంది.ఈ అత్యంత సున్నితమైన ప్రాంతానికి రక్షణ, నౌకలకు భద్రత కల్పిస్తున్నందుకు గానూ న్యాయబద్ధంగా వాణిజ్య నౌకలో తరలిస్తున్న సరకులో 20 శాతాన్ని అమెరికాకు చెల్లించాలి. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది" అని ట్రంప్ పోస్టు చేశారు. అలాగే ప్రస్తుతం హర్మ్యూజ్ తెరిచే ఉందని ట్రంప్ తెలిపారు. అయితే, మునుపటిలాగే ఇరాన్‌కు చెందిన ఓడల రాకపోకలను అమెరికా దిగ్బంధిస్తుందని అన్నారు.

ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్ర స్థాయిలో స్పందించింది. హర్మ్యూజ్ నిర్వహణ విషయంలో అమెరికా చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఇరాన్ మిలిటరీ కమాండ్ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. హర్మ్యూజ్ అంశంపై అమెరికాతో సహకరించడాన్ని 'యుద్ధ చర్య'గా పరిగణిస్తామని గల్ఫ్ దేశాలను హెచ్చరించారు. మరోవైపు అమెరికా దళాల శత్రుపూరిత చర్యలను కారణంగా చూపిస్తూ.. జలసంధిని పూర్తిగా మూసివేసినట్లు ఇరాన్ పర్షియన్ గల్ఫ్ స్ట్రెయిట్ ఆథారిటీ (పీజీఎస్ఏ) ఎక్స్‌లో ప్రకటించింది. పరిస్థితులు కుదుటపడిన తర్వాత, అన్ని దరఖాస్తులు పరిశీలించి.. అనుమతుల ప్రక్రియను తిరిగి ప్రారంభిస్తామని వెల్లడించింది.

# ముఖ్యమంత్రి నివాసం ముట్టడికి 'ఆప్' యత్నం :ఉద్రిక్తత,నాయకుల అరెస్ట్

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్.. మధురానగర్ పీఎస్‌కు తరలింపు

తెలుగు గళం న్యూస్ హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులను తక్షణమే నియంత్రించాలని, విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసం ముట్టడి కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.ఈ ముట్టడి కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వచ్చిన పార్టీ శ్రేణులు,రాష్ట్ర కార్యవర్గ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని, రాష్ట్ర విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న విద్యారంగ సమస్యలను



తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 'ఆప్' నాయకులు ముఖ్యమంత్రి నివాసానికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో సీఎం నివాసం పరిసరాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులకు,పోలీసులకు మధ్య తీవ్ర నెట్టివేత, ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు ముట్టడిని అడ్డుకోవడంతో కాసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.అనంతరం నిబంధనలను ఉల్లంఘించి ఆందోళనకు దిగిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులను, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని,వాహనాలలో మధురానగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా కన్వీనర్ నాగుల అరవింద్ మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టే వరకు మరియు ప్రభుత్వ





పాఠశాలలను బలోపేతం చేసేంత వరకు ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి:జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

## కలెక్టరేట్‌లో ప్రజల నుండి 71 దరఖాస్తుల స్వీకరణ.. అధికారులతో సమీక్ష

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీలకు అధికారులు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో ప్రజల సమస్యల పరిష్కారం కొరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ స్వయంగా 71 దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ బాధితుల వద్దకు వెళ్లి "చెప్పండి... మీ సమస్య ఏంటి?" అంటూ వారి సమస్యలను నిశితంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితుల నుండి దరఖాస్తులను స్వీకరించి,



తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేశారు.అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. తమ సమస్యలు ఎలాగైనా పరిష్కారమవుతాయనే నమ్మకంతోనే ప్రజలు ఎంతో దూరం నుండి కలెక్టరేట్‌కు వస్తున్నారని గుర్తుచేశారు.అధికారులందరూ వారి పరిధిలోకి వచ్చే దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ



చూపాలని స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదన్నారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్,విజయలక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) వసంత కుమారి, భూపాలపల్లి ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి,అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత: రేగొండ ఎస్ఐ డి. సుధాకర్

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ




రేగొండ మండల పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నట్లు రేగొండ సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) డి.సుధాకర్ సోమవారం తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం.. రేగొండ మండలం కనపర్తి గ్రామ శివారు గుండా ఒక ట్రాక్టర్ పరకాల వైపు ఇసుకను తరలిస్తోంది.ఈ క్రమంలో నిఘా ఉంచిన రేగొండ పోలీసులు సదరు ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేయగా,ఇసుక రవాణాకు సంబంధించిన ఎలాంటి రసీదులు గానీ, ప్రభుత్వ అనుమతి పత్రాలు గానీ లేవని తేలింది. దీంతో మడతపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఇచ్చంతుల సునీల్ (తండ్రి రమేష్)ను అదుపులోకి తీసుకున్నారు.అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించామని,నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధాకర్ వెల్లడించారు.నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమ రవాణా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

# సింగరేణికి 'తాడిచెర్ల'బొగ్గు గని కేటాయింపుపై హర్షం



ఖమ్మం,తెలుగు గళం: దక్షిణ భారతదేశానికి వెలుగులు పంచే సింగరేణి సంస్థకు తాడిచెర్ల బొగ్గు గనిని కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కార్మికుల పక్షాన నిలిచి, బొగ్గు గనిని కేటాయించిన ఈ శుభ పరిణామం అనంతరం తొలిసారిగా ఖమ్మం గడ్డపై అడుగుపెట్టిన భారతీయ జనతా పార్టీ అగ్రనేతలకు జిల్లా ప్రజానీకం, పార్టీ శ్రేణులు అడుగడుగునా నీరాజనాలు పట్టారు. సోమవారం జిల్లాలో పర్యటించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచంద్రరావు, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తదితరులకు అపూర్వ ఘన స్వాగతం లభించింది.

నాయకుల రాకతో కూసుమంచి మండలం నాయకునిగూడెం టోల్ ప్లాజా వద్ద పండుగ వాతావరణం నెలకొంది. భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు అగ్రనేతలకు ఘనంగా స్వాగతం పలికారు. పూల మాలలు,శాలువాలతో వారిని సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

# మొగుళ్లపల్లి మండలంలో రూ.1.80 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి మొగుళ్లపల్లి

భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని మొగుళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద రూ.1.80 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం ఘనంగా ప్రారంభించారు. మండలంలోని కొరికిశాల, ఎల్లారెడ్డిపల్లి, మొగుళ్లపల్లి గ్రామాల్లో పూర్తి చేసిన ఈ రోడ్లను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలోని ఇతర మండలాలతో పోలిస్తే మొగుళ్లపల్లి మండలం అభివృద్ధిలో కొంత వెనుకబడి ఉందని, అందుకే ఈ ప్రాంత అభివృద్ధిపై తాను ప్రత్యేక దృష్టి సారించి అత్యధిక నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు.గ్రామాల్లో రోడ్లు, మౌలిక వసతుల కల్పనతో పాటు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొగుళ్లపల్లి మండలానికి కనీసం అంబులెన్స్ సౌకర్యం కూడా కల్పించలేకపోయారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే విమర్శించారు.అయితే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొగుళ్లపల్లి మండల ప్రజల అవసరాలను గుర్తించి, అత్యవసర వైద్య సేవల కోసం అంబులెన్స్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని గుర్తుచేశారు.ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ, ప్రతి గ్రామాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక సర్పంచులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, మండల పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, మహిళా ప్రతినిధులు,కాంగ్రెస్ కార్యకర్తలు,ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# భూ భారతి రీ-సర్వేను విజయవంతం చేయాలి:జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

## ఈ నెల 20లోగా విధుల్లో చేరని లైసెన్స్‌డ్ సర్వేయర్ల లైసెన్సులు రద్దు.. కలెక్టర్ కఠిన హెచ్చరిక





తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భూ భారతి' రీ-సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు రీ-సర్వే ప్రక్రియపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న మొత్తం 91 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం తప్పనిసరిగా రీ-సర్వే విధుల్లో భాగస్వాములు కావాలని ఆదేశించారు.ఈ నెల 20వ తేదీ లోపు విధులకు హాజరుకాని సర్వేయర్ల లైసెన్స్‌లను తక్షణమే రద్దు చేయడం జరుగుతుందని కలెక్టర్ తీవ్రంగా హెచ్చరించారు.శాస్త్రీయంగా సర్వే నిర్వహించడం ద్వారా ప్రజలకు, ముఖ్యంగా దశాబ్దాలుగా భూ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రైతులకు ఎంతో న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి ఇదొక గొప్ప అవకాశమని, సర్వేయర్లు దీన్ని ఒక బాధ్యతగా గుర్తించి పూర్తి చేయాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా ప్రాథమికంగా ఎంపిక చేసిన 7 గ్రామాలలో ఈ రీ-సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉందని కలెక్టర్ వెల్లడించారు.రైతుల భూ సమస్యలను పరిష్కరించే ఈ బృహత్తర కార్యక్రమానికి సర్వేయర్లు అందరూ పూర్తి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ సహాయ సంచాలకులు (ఏడీ) కుసుమ కుమారి,జిల్లా వ్యాప్తంగా ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల యూనిఫాంల కుట్టుపని వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

## నాణ్యతలో రాజీపడొద్దు.. అధికారులతో సమీక్షా సమావేశం






తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

భూపాలపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ,సంక్షేమ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో నాణ్యమైన యూనిఫాంలను అందజేసేందుకు వీలుగా కుట్టుపని ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో యూనిఫాంల తయారీ,దాని ప్రగతిపై ఎస్సీ, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ,విద్యాశాఖ అధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు యూనిఫాంలు సకాలంలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో కుట్టుపని పురోగతిని ప్రతిరోజు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.పంపిణీ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకూడదని,గుడ్డ కుట్టు నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.వివిధ సంక్షేమ శాఖల అధికారులు, స్వయం సహాయక (ఐకేపీ) సంఘాలు, మరియు మెప్మా ప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదన్నారు.ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రాజేందర్, డీఆర్డీఓ బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, బీసీ సంక్షేమ అధికారి ఇందిర, ఎస్సీ అభివృద్ధి అధికారి సుకీర్తి జై భీం, మైనారిటీ సంక్షేమ అధికారులు నాగసాగర్, కుమారస్వామి, మరియు వివిధ సంక్షేమ, మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# పారా క్రీడాకారుడు సిద్ధార్థ్ నాయక్ కు చైర్మన్ సన్మానం




స్టేషన్ ఘన్‌పూర్, ప్రతినిధి,జూలై 13 : /తెలుగు గళం న్యూస్/

ఇటీవల జరిగిన అథ్లెటిక్ పోటీలలో పారా క్రీడాకారుడు అజ్మీర సిద్ధార్థ్ నాయక్ రాష్ట్రస్థాయిలో రజత పథకం సాధించగా సోమవారం మొగుదుంపురం కిషోర్, పోశాల కృష్ణమూర్తి సహకారంతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని జిట్టగూడెం తండా గ్రామ పంచాయతీకి చెందిన పారా క్రీడాకారుడు అజ్మీరా

సిద్ధార్థ నాయక్ స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ తాటికొండ వినయ్ సిద్ధార్థ్ నాయక్ ను సన్మానించారు. సిద్దార్థ నాయక్ స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ లో చైర్మన్ తాటికొండ వినయ్ ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం అందుకున్న అనంతరం మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రోత్సాహంతో రాష్ట్ర స్థాయిలో రజత పథకం సాధించి మన స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీకి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చిన సిద్ధార్థ్ నాయక్ ను చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, మొగుదుంపురం కిషోర్ , పోషాల కృష్ణ లతో పాటు గ్రామస్తుల అభినందించారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.